సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ◆ 9 ◆ మార్చి ◆ 2024

గరిష్ఠం / కనిష్ఠం
37°/ 23°

వాతావరణం

జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ వాతావరణం చల్లబడుతుంది.

శివోహం..

మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జాము నుంచే భక్తులు శైవక్షేత్రాలకు చేరుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. రాత్రి వేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. వివరాలు 9లో





అన్నపురెడ్డిపల్లి : మల్లికార్జునస్వామి ఆలయంలో సందడి (ఇన్‌సెట్) పాల్వంచ : ఆత్మలింగేశ్వరాలయంలో..

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

వైభవంగా రుద్రహోమం



రుద్రహోమం పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రుద్రహోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. యాగశాలలో రుద్రహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజల అనంతరం రుద్రహోమం గావించారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

డీసీఎంఎస్ చైర్మన్ పూజలు

డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు శుక్రవారం పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, నాయకులు రాజ్ గౌడ్, కొండం వెంకన్న, సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు రేపు ఎంపిక పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ తదితర పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఖమ్మంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఉచితంగా ఐదు నెలల ఫౌండేషన్ కోర్స్ నిర్వహించనున్నట్లు డీడీ సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం నుంచి 540 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో నుంచి అభ్యర్థుల ఎంపిక కోసం ఈనెల 10న ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు tsstudycircle.co.in వెబ్‌సైట్ నుండి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని ఉదయం 11గంటలకు మొదలయ్యే పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.

కమలం జోరు..

సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికలు

- రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో జిల్లా
- బీజేపీ నుంచి పోటీకి నేతల ఆసక్తి
- తెరపైకి వచ్చిన కొత్త పేర్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంటు ఎన్నికల వ్యూహాల అమలులో భారతీయ జనతా పార్టీ దూకుడు పెంచింది. ఇప్పటికే బీజేపీ నుంచి పోటీ చేసేందుకు అనేక మంది అభ్యర్థులు ఆసక్తి చూపిస్తుండగా శివరాత్రి పండగ రోజున కొత్త పేర్లు తెర మీదకు వచ్చాయి. వీరిద్దరికి రాజకీయ నేపథ్యం ఘనంగానే ఉండటంతో ఒక్కసారిగా బీజేపీ టాప్‌గేర్‌లోకి వచ్చినట్లయింది.

బీజేపీ నేతలతో జలగం వెంకటరావు చర్చలు

మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు తనయుడు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు, బీజేపీ నేతల మధ్య శుక్రవారం జరిగిన చర్చలు చర్చనీయాంశంగా మారాయి. మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డితో జలగం వెంకటరావు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ప్రస్తుతం కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ తరఫున జలగం వెంకటరావు బరిలోకి దిగుతారనే చర్చలు మొదలయ్యాయి. ఈ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు రంగాకిరణ్, వాసుదేవరావు, ఈవీ రమేశ్‌లు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ములకలపల్లి మండలానికి చెందిన వ్యాపారవేత్త తాండ్ర వినోద్‌రావు సైతం ప్రచారం మొదలెట్టారు. వీరిలో ఒకరికి టికెట్ దక్కుతుందనే భావన కమలం కేడర్‌లో నెలకొంది. కానీ అనూహ్యంగా జలగం వెంకటరావు పేరు తెర మీదకు వచ్చింది. కాగా వెంకట్రావు 2004లో సత్తుపల్లి నుంచి, 2014లో కొత్తగూడెం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2009లో ఖమ్మం , 2023లో కొత్తగూడెం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను కలిసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుంచి గత ఎన్నికల్లో జాటోత్ హుస్సేన్‌నాయక్ పోటీ చేశారు. ఈసారి కోయ సామాజికవర్గం నుంచి ప్రభుత్వ ఉద్యోగి చెంచు రామకృష్ణ, యాప సీతయ్యలు టికెట్ ఆశిస్తున్నారు. బంజారా నుంచి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తేజవత్ రామచంద్రునాయక్ మహబూబాబాద్ నుంచి పోటీకి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఊహకందని విధంగా మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను కలిశారు. హన్మకొండలో సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. కాకతీయ వర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సీతారాంనాయక్ 2014లో జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఆయనకు ఆ పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో బీఆర్ఎస్ పట్ల సీతారాంనాయక్ అసంతృప్తితో ఉన్నారు. ఈ తరుణంలో బీజేపీ ఆయనతో చర్చలు ప్రారంభించింది. తనకు గుర్తింపు ఇచ్చే పార్టీలో పని చేసేందుకు సుముఖంగా ఉన్నట్టు సీతారాంనాయక్ వెల్లడించారు.

రెండు స్థానాలకు

జిల్లా పరిధిలో కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం, ఇల్లెందు, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మొదటి రెండు అసెంబ్లీ స్థానాలు ఖమ్మం (జనరల్) పరిధిలో ఉండగా మిగిలిన స్థానాలు మహబూబాబాద్ (ఎస్టీ) కిందకు వస్తాయి. ఈ రెండు స్థానాలకు సంబంధించి రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను బీఆర్ఎస్ ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ సైతం అభ్యర్థుల వడపోతను పూర్తి చేసి, మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించింది. ఖమ్మం అభ్యర్థిని ప్రకటించాల్సిఉంది. గడిచిన రెండు పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చూపిన బీజేపీనే ఈ విషయంలో కొంత వెనకబడిందనే అభిప్రాయం నెలకొంది. ఈ తరుణంలో ఒకేరోజు బీజేపీ జోరు పెంచింది.

మానుకోటలో మళ్లీ పోరిక

- బలరాంనాయక్‌కు టికెట్ కేటాయించిన కాంగ్రెస్
- నాలుగోసారి పార్లమెంట్ ఎన్నికల బరిలో..



పోరిక బలరాంనాయక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ పేరును కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ స్థానాలు మహబూబాబాద్ పార్లమెంటు స్థానం పరిధిలో ఉన్నాయి. ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు అనేక మంది నేతలు ఆసక్తి చూపించినా చివరకు బలరాంనాయక్‌కే టికెట్ దక్కింది. పోలీస్ శాఖలో ఉద్యోగిగా ఉంటూ రాజకీయాలపై పోరిక బలరాంనాయక్ ఆసక్తి పెంచుకున్నారు. కాంగ్రెస్ నుంచి 2009లో మహబూబాబాద్ నుంచి తొలిసారిగా పార్లమెంటుకు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి, మాజీ ఐపీఎస్ అధికారి డీటీ నాయక్‌పై విజయం సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 2013లో జరిగిన కేంద్ర మంత్రివర్గ విస్తరణలో సహాయ మంత్రి పదవిని పొందారు. ములుగు మెడికల్ కాలేజీ డిమాండ్‌ను తొలిసారిగా ఆయనే తెర మీదకు తెచ్చారు.

నాలుగోసారి బరిలో..

తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో బలరాంనాయక్ ఓటమి చవి చూశారు. ఆ తర్వాత 2018లో జరిగిన అసెంబ్లీ, 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి పోటీ చేసినా గెలుపు తీరాలకు చేరలేకపోయారు. వరుసగా ఓటములు పలకరిస్తున్నా, సహచర నేతలు హస్తాన్ని వీడి ఇతర పార్టీలోకి వెళ్తున్నా ఆయన కాంగ్రెస్‌నే అంటి పెట్టుకుని ఉన్నారు. గత ఎన్నికల్లో మహబూబాబాద్, ఇల్లెందు స్థానాల నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని ప్రయత్నించి సఫలం కాలేకపోయారు. ఎట్టకేలకు తీవ్రపోటీ మధ్య మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్‌ను దక్కించుకుని నాలుగోసారి ఎన్నికల బరిలోకి దూకనున్నారు. ఈ స్థానానికి సంబంధించి ఇప్పటికే తమ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితను బీఆర్ఎస్ ప్రకటించింది. రేపోమాపో బీజేపీ సైతం అభ్యర్థిని ప్రకటించనుంది.

సమ్మక్క తల్లీ.. సల్లంగా చూడు..



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

గుండాల: మెట్టినింట్లో కొలువైన సమ్మక్కకు, ఆమె పతిదేవుడు పగిడిద్దరాజుకు శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆయురారోగ్యాలతో సల్లంగ చూడాలని వేడుకున్నారు. యాపలగడ్డలో గురువారం గద్దెనెక్కిన దేవతలకు శుక్రవారం తెల్లవారు జామునుంచి ఆలయ పూజారులు, వడ్డెలు, అర్రెం వంశీయుల ఆచార సంప్రదాయలతో ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి గంగాస్నానం చేయించారు. తెల్లవారుజామున హారం ఊరేగింపుతో గద్దెల వద్దకు వచ్చి వన దేవతలకు నైవేద్యం సమర్పించారు. దేవతలకు బెల్లం(బంగారం) సమర్పించి, కొబ్బరికాయలు కొట్టారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్ బందోబస్తు నిర్వహించారు. మూడు రోజుల నుంచి అంగరంగ వైభవంగా సాగుతున్న జాతర శనివారంతో ముగియనుంది. ఈ కార్యక్రమంలో మేడారం ట్రస్ట్ చైర్మన్ అర్రెం లచ్చు పటేల్, అర్రెం అప్పయ్య, నాగయ్య, లక్ష్మీనర్సు, పెద్ద కాంతారావు, భిక్షం, సత్యం, సమ్మయ్య, చిన్న కాంతారావు, రామారావు, సమ్మయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం 9లో

జిల్లావ్యాప్తంగా శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలువురు వనితలను సన్మానించారు.



ఇల్లెందులో సన్మానం అందుకుంటున్న మహిళలు

సీఎం పర్యటన ఖరారు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఈ నెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారైనట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇతర కేబినెట్ మంత్రులతో కలిసి భద్రాచలంలో పర్యటించనున్నారని తెలిపారు. 11న ఉదయం తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని, తర్వాత మిథిలా స్టేడియంలో నిర్వహించే జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో మూడువేలమంది ప్రజల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్న భోజనం తర్వాత మణుగూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. హెలీప్యాడ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీకి సూచించారు. కల్యాణ మండపం వద్ద ఎలక్ట్రికల్, జనరేటర్, ఏసీల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ సౌకర్యాలను పర్యవేక్షించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌కు సూచించారు. ప్రజలకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఆర్డీఓకు, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌పై జరిగిన, జరగాల్సిన పనుల పూర్తి నివేదికను సిద్ధం చేసుకోవాలని ఈఈ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. బారికేడింగ్, హెలీప్యాడ్, కుర్చీలు, మణుగూరులో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్ అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసుకోవాలని దేవస్థానం ఈఓ రమాదేవిని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లపై పర్యవేక్షణ చేయాలని డీఆర్వో రవీంద్రనాథ్‌ను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రవీంద్రనాథ్, డీఆర్‌డీఓ విద్యాచందన, ఏఓ గన్యా, డీఎంహెచ్ఓ శిరీష, డీఎస్ఓ రుక్మిణీదేవి, భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీఓలు దామోదర్‌రావు, మధు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇరిగేషన్ ఈఈ అర్జున్, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం తదితరులు

మణుగూరు రూరల్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పినపాక నియోజకవర్గం మణుగూరులో ప్రారంభించేందుకు సీఎం రానుండగా, మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలో సభాస్థలి, పార్కింగ్ ప్లేస్, హెలిప్యాడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ తొలుత బహిరంగ సభ కోసం బూర్గంపాడును ఎంపిక చేసుకున్నా, కొన్ని కారణాల వల్ల బహిరంగ సభను మణుగూరుకు మార్చినట్లు తెలిపారు. సీఎం పర్యటనకు ఇంకా రెండు రోజులే సమయం ఉందని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల శంకర్, తరుణ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, వెంకట్‌రెడ్డి, కోటేశ్వరరావు, సీఐ సతీష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

- నకిలీ విత్తనాలతో రైతుల గుండెల్లో గుబులు
- నిద్రావస్థలో టాస్క్‌ఫోర్స్ అధికారులు
- 44,548 ఎకరాల్లో యాసంగి వరిసాగు





ములకలపల్లి మండలంలో వరిపంట (ఇన్‌సెట్) నిర్ణీత వ్యవధికంటే ముందే వచ్చిన తాలు కంకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నకిలీ వరి విత్తనాలు అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా అక్రమార్కులు పట్టించుకోకుండా యథేచ్ఛగా 'నకిలీ' వ్యాపారం చేస్తూనే ఉన్నారు. రైతులకు మేలైన సేవలు అందించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డిప్లొమా కోర్సులు ప్రవేశపెట్టి డీలర్లకు శిక్షణ ఇస్తున్నా అన్నదాతలకు ఒరిగేదేమీ లేకుండా పోతోంది.

లక్ష్యానికి మించి వరి సాగు..

జిల్లాలో ఈ యాసంగిలో సాధారణ విస్తీర్ణం కంటే అధికంగానే రైతులు వరి సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 36,867 ఎకరాలు కాగా 44,548 ఎకరాల్లో వరి పంట వేశారు. అయితే విత్తనాల్లో లోపంతో అక్కడక్కడ తేడాలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ములకలపల్లి మండలం తాళ్లపాయలో పలువురు రైతులు సాగు చేస్తున్న 50 ఎకరాల వరి పంట 60 రోజుల వ్యవధిలోనే ఈనడం, కంకులు రావడంతో భయాందోళన చెందిన రైతులు మూడు రోజుల క్రితం వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. దుబ్బుకట్టకుండా బలహీనంగా మారి తాలు వరి కంకులు ఏర్పడ్డాయని, దీంతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని, పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తన సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు గతనెల చివరిలో పంటలను పరిశీలించినా సరైన న్యాయం చేస్తామనే హామీ లభించకపోవడంతో పురుగుమందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఎన్ని ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతుందో అని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు, టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిఘా పెంచి నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరుతున్నారు. వరిసాగులో వస్తున్న దుష్ఫలితాలను అరికట్టేందుకు సరైన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

నిద్రావస్థలో టాస్క్‌ఫోర్స్..

నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నియంత్రణకు మండల, జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటుచేసినా అవి నిద్రావస్థలో ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ఈ కమిటీలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నకిలీ సరుకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. గతంలో ఇలా తనిఖీలు నిర్వహించి అక్రమార్కులపై చర్యలు చేపట్టినా.. ఇటీవలి కాలంలో నిఘా కరువైందనే విమర్శలు వస్తున్నాయి.

కంకులు బలహీనంగా వస్తున్నాయి



విత్తనాల్లో లోపంతో నిర్ణీత వ్యవధి కంటే ముందుగానే, బలహీనంగా వరికంకులు వస్తున్నాయి. దీంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి. లేదంటే పెట్టుబడి ఖర్చు కూడా రాక ఆర్థికంగా నష్టపోతాం.

–కొండ్రు పాపారావు, తాళ్లపాయ, ములకలపల్లి మండలం

'ఎన్‌సీడీ'తో మెరుగైన వైద్యం

- జిల్లాలో 2019 నుంచి కార్యక్రమం అమలు
- తొలి దశలోనే కేన్సర్ లక్షణాలు గుర్తింపు, వైద్యసహాయం
- బీపీ, షుగర్ బాధితులకు ఖరీదైన మందులు పంపిణీ



భద్రుతండాలో ఎన్సీడీ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

కొత్తగూడెంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఎన్సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్–అసంక్రమిత వ్యాధుల నియంత్రణ) కార్యక్రమంతో జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. కేన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏఎన్ఎంలు స్క్రీనింగ్ చేసి ప్రాథమికంగా రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, ఓరల్ కేన్సర్ తదితర లక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తున్నారు. అనంతరం వైద్యాధికారులు తగిన పరీక్షలు చేసి, కేన్సర్ నిర్ధారణ జరిగితే బాధితులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. జిల్లాలో 2019లో ఎన్సీడీ కార్యక్రమాన్ని ప్రారంభించగా, 30 సంవత్సరాల వయసు దాటిన వారందరికీ స్క్రీనింగ్‌చేసి ఎవరైతే బీపీ, షుగర్, కేన్సర్ వ్యాధులతో బాధపడుతున్నారో గుర్తించి తగిన వైద్యసహాయం అందిస్తున్నారు. 30 ఏళ్ల వయసు దాటినవారు 5,61,792 మంది ఉండగా, వారిలో 5,22,801 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. 61,165 మంది బీపీతో, 32,025 మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి నెలనెలా వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి, తగిన మందులు ఇస్తున్నారు. ఎన్సీడీ కార్యక్రమం ద్వారా ఖరీదైన మందులను ఉచితంగా అందిస్తున్నారు.

పాలియేటివ్‌కేర్ ద్వారా వైద్య సేవలు

జిల్లాలోని సర్వజన ఆస్పత్రిలోని పాలియేటివ్ కేర్ ఆధ్వర్యంలో ఆలనా వాహనం ద్వారా కేన్సర్ రోగులను ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకొచ్చి, చికిత్స అనంతరం తిరిగి అదే వాహనంలో ఇంటికి పంపిస్తున్నారు. రొమ్ము కేన్సర్ బాధితులు 80 మంది, సర్వైకల్ కేన్సర్ 32, తల, మెడ భాగంలో వచ్చే కేన్సర్ బాధితులు 80, ఊపిరితిత్తుల కేన్సర్ 20, బ్లడ్ కేన్సర్ 21, ఎముకల కేన్సర్ 4, జీర్ణాశయ కేన్సర్ 12, రెక్టమ్(పురుషనాళ) కేన్సర్ 11, కిడ్నీ కేన్సర్ 3, ఇతర కేన్సర్ బాధితులు 18 మంది.. మొత్తం 322 మంది ఇప్పటివరకు పాలియేటివ్ కేర్ ద్వారా వైద్య సేవలు పొందుతున్నారు. ఇక హోమ్ విజిట్ ద్వారా 1,275 మందికి వైద్య సేవలు అందించారు.

తాజాగా మరో ఆరుగురి గుర్తింపు

2023– 24 సంవత్సరం జిల్లాలో ఆరు కేన్సర్ కేసులు గుర్తించారు. పాల్వంచ మండలం నవభారత్‌లో, ములకలపల్లి మండలం గంగారంలో, అన్నపురెడ్డిపల్లి పెట్లం గ్రామంలో, ఇల్లెందు మండలం పోలారం గ్రామంలో, బూర్గంపాడులో, ఇల్లెందు మండలం కొమ్ముగూడెంలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఆరుగురిని స్క్రీనింగ్ ద్వారా గుర్తించి, హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే, బసవతారక ఆస్పత్రికి పంపించి చికిత్స అందిస్తున్నారు. టెలిమానస్ కార్యక్రమంలో భాగంగా ట్రోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేస్తే మానసికంగా ఇబ్బంది పడుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

సకాలంలో చికిత్స తీసుకోవాలి



ఎన్సీడీ సేవలను సద్వినియోగం చేసుకుని దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చు. జిల్లాలో 30 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఎన్సీడీ కార్యక్రమంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఏదైనా దీర్ఘకాలిక వ్యాధి బారినపడితే తక్షణమే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలి.

– డాక్టర్ వి.మధువరన్, ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు 10న పరీక్ష

పాల్వంచ రూరల్ : కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సైనిక్ స్కూల్, కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 10వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ పరీక్ష ఉంటుందని ఖమ్మం ఆర్సీఓ ప్రత్యూష తెలిపారు. ఖమ్మంలోని సాంఘిక సంక్షేమ గురుకుల అంబేద్కర్ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల టేకులపల్లి జూనియర్ కళాశాల, భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, మహబూబాబాద్‌లోని గురుకుల జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఆరో తరగతి ప్రవేశపరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఇంటర్ ప్రవేశపరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు.

సింగరేణిలో 27 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న 27 మంది అధికారులను బదిలీ చేశారు. ఈ విషయమై యాజమాన్యం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఒక డీవైఎస్ఈతో పాటు 25 మంది అండర్ మేనేజర్లు, ఒక మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రెయినీ జాబితాలో ఉండగా, నూతన స్థానాల్లో వెంటనే చేరాలని ఆదేశించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త నారంవారిగూడెం గ్రామ శివారులోగల ఓ తోటలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.9,800 నగదుతోపాటు 10 పందెం కోడి పుంజులు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పీహెచ్‌సీ వద్ద బైక్ దగ్ధం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం పీహెచ్‌సీ వద్ద శుక్రవారం బైక్ దగ్ధమైంది. ఈ ఘటన ఆస్పత్రి వర్గాల్లో భయాందోళన కలిగించింది. మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ రాళ్లగుంపు గ్రామానికి చెందిన సౌజన్య డెలివరీ కోసం ఆస్పత్రిలో చేరింది. ఆమెను చూసేందుకు బంధువు జోగా శేఖర్ బైక్‌పై ఆస్పత్రికి చేరుకున్నాడు. బైక్ నిలిపి లోపలికి వచ్చిన కొద్ది నిమిషాల్లోనే బైక్ నుంచి మంటలు ఎగిసిపడటంతో ఆస్పత్రి సిబ్బంది, రోగులు దూరంగా పరుగులు తీశారు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయాలు

కామేపల్లి: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్ల కాపరి శేఖర్ ద్విచక్ర వాహనంపై శుక్రవారం మద్దులపల్లి నుంచి ముచ్చర్ల వైపు వెళ్తున్నాడు. ఈక్రమాన మద్దులపల్లి శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

చెట్టుకు ఢీకొన్న బైక్.. ఒకరు మృతి..

పాల్వంచ: మద్యం మత్తులో బైక్‌తో చెట్టును ఢీకొట్టిన వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పేటచెరువు గ్రామానికి చెందిన పూనెం ప్రకాశ్ (27) గురువారం మద్యం సేవించి మోటార్ సైకిల్ నడుపుకుంటూ పేటచెరువు శివారులోని ఓ వేప చెట్టును ఢీకొట్టాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. శుక్రవారం మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించేలోగానే మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, కుమార్తె ఉంది. సుజాత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తాపడి యువకుడు...

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ములకలపల్లి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కమ్మపాటి ముత్తయ్య కుమారుడు నాగరాజు (26) తన స్నేహితుడిని కలిసేందుకు బైక్‌పై కొత్తగూడెం వచ్చాడు. ఈ క్రమంలో బైక్‌ను వేగంగా నడుపుతుండటంతో అది అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులకు నాగరాజు ఒక్కడే కుమారుడు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,045

క్యాంటీన్ల పేరుతో దుబారా?

- కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో పక్కపక్కనే రెండు క్యాంటీన్లు
- డిపార్ట్‌మెంట్ క్యాంటీన్ నిర్వహణలో ఉద్యోగుల విధులు
- ఎక్కడ లేకున్నా ఈ కర్మాగారంలోనే రెండు సబ్సిడీ క్యాంటీన్ల ఏర్పాటు



కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారం

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తి చేసే కర్మాగారంలో పలు రకాల పనుల నిర్వహణలో దుబారాకు తావిస్తున్నట్లు అక్కడి ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఏ కర్మాగారంలో అయినా ఉద్యోగులు, కార్మికుల కోసం సబ్సిడీ క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తారు. కానీ, పాల్వంచ కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో మాత్రం రెండు సబ్సిడీ క్యాంటీన్‌లు నిర్వహిస్తుండటం గమనార్హం. ఒక ప్రైవేట్ కంపెనీ క్యాంటీన్ ఉన్నప్పటికీ మళ్లీ డిపార్ట్‌మెంట్ క్యాంటీన్ నిర్వహించడం వల్ల సంస్థకు భారీ ఎత్తున నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. ఈ క్యాంటీన్‌లో జేపీఏ (జూనియర్ ప్లాంట్ అటెండెంట్), ఆర్టిజన్ సిబ్బంది రెండు షిఫ్ట్‌లవారీగా సుమారు 25 నుంచి 30 మంది వరకు పనిచేస్తున్నారు. ఈ రెండు క్యాంటీన్‌లు కూడా అతి దగ్గరగా నిర్వహిస్తున్నారు. రెండు చిన్నవిగా ఉన్నాయని భావిస్తే ఒక క్యాంటీన్‌లో సిబ్బందిని పెంచడంతో సౌకర్యాలు కల్పిస్తే బాగుటుందని చెబుతున్నారు. కేటీపీఎస్ 7వ దశ, బీటీపీఎస్, కేటీపీపీ, ఇలా జెన్‌కోలోని ఏ కర్మాగారంలోనూ ఒక క్యాంటీన్ మాత్రమే ఉండగా ఇక్కడ మాత్రం రెండు క్యాంటీన్‌లు ఉన్నాయని చెబుతున్నారు.

కేవలం టిఫిన్ కోసం డిపార్ట్‌మెంట్ క్యాంటీన్

కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో వెయ్యి మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి నడుస్తోంది. కాగా, షిఫ్ట్‌ల వారీగా ఇక్కడి ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే వీరికి అల్పాహారం, భోజనం కోసం జెన్‌కో యాజమాన్యం ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం చేసుకుని కేరళ క్యాంటీన్‌ను సబ్సిడీతో నిర్వహిస్తోంది. ఇందుకు గాను అతి పెద్ద కుకింగ్ గది, సువిశాలమైన హాళ్లు, ప్రత్యేకంగా టిఫిన్, భోజనం చేసే విధంగా గదులు, ముందు అతి పెద్ద పార్కింగ్, కరెంట్, మంచినీటి సదుపాయం, ఇతర వసతులు కల్పించింది. ఇదిలా ఉండగా ఆ పక్కనే కర్మాగారం మొదటి నుంచి నడుస్తున్న డిపార్ట్‌మెంట్ క్యాంటీన్ అలానే నడుస్తోంది. ఇక్కడ ఉదయం, సాయంత్రం కేవలం టిఫిన్‌లు మాత్రమే అందిస్తారు. ఈ క్యాంటీన్ కోసం రెండు షిఫ్ట్‌ల్లో సుమారు 30 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ క్యాంటీన్‌ని తీసేస్తే అందులో పనిచేసే ఉద్యోగులను ఇతర విభాగాల్లో అత్యంత కీలకమైన పనుల్లో వాడుకునే వీలుంటుందని అక్కడి ఉద్యోగులే చెబుతున్నారు. రెండు క్యాంటీన్‌ల నిర్వహణ వల్ల విద్యుత్ ఖర్చులు, వాటర్, సిబ్బంది, తదితర దుబారా తగ్గుతుందని కార్మిక సంఘాలు వాపోతున్నాయి.

అధికారులు దృష్టి సారించేనా?

ఇలా రెండు క్యాంటీన్‌లు దశాబ్దాల తరబడి నడుస్తుండటం గమనార్హం. ఎక్కువగా ప్రైవేట్ క్యాంటీన్‌కే అక్కడి సిబ్బంది ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇక ఇంటి వద్దే తిని రావడం వల్ల ఈ క్యాంటీన్‌లను అతి తక్కువ మంది ఉపయోగించుకుంటారు. ఇలా రెండు క్యాంటీన్‌ల నిర్వహణ తీరుతెన్నులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సంస్థ ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు.

రెండు క్యాంటీన్ల అవసరం ఉంది



మొదటి నుంచి డిపార్ట్‌మెంట్ క్యాంటీన్ నడుస్తోంది. అది చాలదని ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకుని మరో సబ్సిడీ క్యాంటీన్ తెరిచాం. ఏది తీసేసినా మరో చోట ఎక్కువ మందితో నెట్టుకు రావడం కష్టతరంగా ఉంటుంది. రెండు క్యాంటీన్‌ల అవసరం ఉంది.

– ఎం.ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5, 6 దశల సీఈ

శివాలయంలో వైభవంగా పూజలు



యాగం చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు



ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అన్నపురెడ్డిపల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా శుక్రవారం పలువురు పూజలు చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఎస్పీ రోహిత్‌రాజు, అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ రోహిత్‌రాజు యాగంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



కల్యాణం తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: శ్రీభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామివారి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిపారు. ఆలయానికి ఎదురుగా ఉన్న మండపంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు, తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వనమా గాంధీ, కల్లోజి వెంకటేష్, పర్సా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాత కక్షలతో వ్యక్తి హత్య

- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- పోలీసుల అదుపులో నిందితులు



మల్లయ్య (ఫైల్)

పాల్వంచరూరల్: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఓ వ్యక్తిని మరో వ్యక్తి కర్రతో కొట్టి హత్య చేశాడు. ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించినప్పటికీ హత్య విషయం వెలుగుచూడటంతో పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పాల్వంచ మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని బంజర జీపీ కుంజావెంకయ్యగుంపునకు చెందిన వ్యవసాయ పనులతోపాటు ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేసే కల్తీ మల్లయ్య (47) కుమారుడికి కొన్నేళ్ల కిందట జోగా రాము తన అక్కను ఇచ్చి వివాహం చేశారు. మల్లయ్య కుమారుడు కరోన సమయంలో మృతి చెందాడు. అప్పటి నుంచి రాము, కల్తీ మల్లయ్య మధ్య వాగ్వాదం జరుగుతోంది. గురువారం రాత్రి కల్తీ మల్లయ్య, జోగా రాము, పూనేం శివ ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై బంజర డంపింగ్‌యార్డు వద్దకు వెళ్లి మద్యం సేవించారు. తర్వాత ముగ్గురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో జోగా రాము కర్రతో కల్తీ మల్లయ్య తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత మల్లయ్య మృతదేహాన్ని రాము, శివ ద్విచక్రవాహనంపై తీసుకొచ్చి గ్రామశివారులో రోడ్డుపై పడేసి మద్యం మత్తులో బండి పైనుంచి పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులను నమ్మించారు. కానీ, స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి రాము, శివను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం తెలిసింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య పొట్టమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

రుణం పేరిట రూ.9వేలు స్వాహా

కామేపల్లి: సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నా ప్రజల్లో అవగాహన లేక మోసాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పండితాపురానికి చెందిన ఓ మహిళ సైబర్ నేరగాడి మాయమాటలకు డబ్బు కోల్పోయిన ఘటన వెలుగుచేసింది. పండితాపురానికి చెందిన రమకు గురువారం ధని ఫైనాన్స్‌కంపెనీ నుంచి అని చెబుతూ ఓ వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడాడు. రూ.5లక్షలు మొదలు రూ.15లక్షల వరకు రుణం తీసుకోవచ్చని నమ్మబలకగా ఆమె రూ.5లక్షల రుణం కావాలని చెప్పింది. దీంతో వివరాలన్నీ తీసుకున్న ఆయన విడతల వారీగా రూ.8వేల నగదు డిపాజిట్ చేయించుకున్నాడు. తిరిగి శుక్రవారం ఫోన్ చేసిన మరో రూ.1,100 చెల్లించాలని చెప్పడంతో రమ డిపాజిట్ చేసింది. ఆతర్వాత అకౌంట్ హోల్డ్‌లో పడినందున మళ్ల రూ.5,550 కట్టాలని సూచించాడు. కానీ ఆమె తన అకౌంట్ మనుగడలో ఉందని తెలపగా, నగదు చెల్లించకపోతే కేసు పెట్టాల్సి వస్తుందని బెదిరించాడు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన రమ పోలీసులను ఆశ్రయించి వారి సూచన మేరకు సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేసింది. కాగా, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

బినామీలతో రేషన్ షాపులు!

- సకాలంలో బియ్యం అందక లబ్ధిదారులపాట్లు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



కొత్తగూడెం శ్రీనగర్ కాలనీలోని రేషన్‌షాపు

నవభారత్: రేషన్ దుకాణాల నిర్వహణలో బినామీల హవా నడుస్తోంది. ఒక్కరే మూడు, నాలుగు షాపులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. రేషన్ షాపులను డీలర్లు కాకుండా బినామీలు నిర్వహిస్తుండటంతో లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందడంలేదు. పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని 23 మండలాలు, 4 మున్సిపాలిటీల పరిధిలో 442 రేషన్ షాపుల ద్వారా రేషన్ బియ్యాన్ని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. వీటిల్లో ఎక్కువ షాపులు బినామీ కనుసన్నల్లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో రేషన్ డీలరు రెండు నుంచి నాలుగు రేషన్ షాపులకు బినామీలుగా ఉండి, రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ కోసం వెళ్తే ఈ రోజు స్టాక్ లేక తీయలేదని, పక్క ఏరియాలో ఉంది కూడా మన షాపేనని, అక్కడకు వెళ్లాలని చెబుతున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. గత నెల 11న కొత్తగూడెం శ్రీనగర్ కాలనీలోని రేషన్ షాపు నుంచి బియ్యం అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీలు చేపట్టిన అధికారులు అంతా సక్రమంగానే ఉందని చెప్పడం గమనార్హం. బినామీల షాపుల నిర్వహణపై జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రుక్మిణిని వివరణ కోసం ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

● ఆకులు రాలాయి.. పూలు పూచాయి..!



ఆకులు లేని గన్నేరు చెట్టుకు పూసిన పువ్వులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న చెట్టుకు ఆకులు లేవు. కానీ, చెట్టంతా పువ్వులు పూచాయి. అశ్వారావుపేట మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహం ఆవరణలో ఉన్న ఈ చెట్టు పేరు గన్నేరు. ఏటా ఫిబ్రవరి, మార్చి నెలలో చెట్టు ఆకులన్నీ రాలిపోయిన తర్వాత తెల్లని పూలు పూయడం దీని ప్రత్యేకత. చెట్టంతా పూలు పూసినా ఒక్క ఆకు కూడా లేకపోవడంతో చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– అశ్వారావుపేటరూరల్

దొంగ నోట్ల కలకలం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారంలో దొంగనోట్ల చెలామణి కలకలం సృష్టించింది. గ్రామంలోని పెట్రోల్‌బంక్ గురువారం రాత్రి వచ్చిన ఓ వ్యక్తి కారులో రూ.5వేల విలువైన డీజిల్ కొట్టించాక రూ.500 దొంగనోట్లు ఇచ్చాడు. ఈ విషయాన్ని కాస్త ఆలస్యంగా గుర్తించిన సిబ్బంది ప్రశ్నిస్తుండగా సదరు వ్యక్తి పరారయ్యారు. ఆయన ఖమ్మం వైపు నుంచి వచ్చాడని సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై సత్తుపల్లి సీఐ కిరణ్‌ను వివరణ కోరగా దొంగనోట్ల చెలామణి తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపడతామని తెలిపారు.

హారన్ కొట్టాడని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

బస్సు అద్దాలనూ ధ్వంసం చేయడంతో అరెస్ట్

కామేపల్లి: రోడ్డుపై అడ్డంగా నిలిపిన ఆటోను పక్కకు తీయాలని ఆర్టీసీ డ్రైవర్ హారన్ కొట్టడంతో ఆగ్రహించిన ఆటోడ్రైవర్ ఆయనతో పాటు కండక్టర్‌పై దాడి చేయడమే కాక బస్సు అద్దాలను ధ్వంసం చేశాడు. కామేపల్లి మండలం గోవిందాలలో గురువారం రాత్రి ఈ చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి గార్ల వెళ్లి తిరిగి ఖమ్మం బయలుదేరిన బస్సు గోవింద్రాల మీదుగా వస్తోంది. గోవింద్రాల గ్రామంలో రోడ్డుపై అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ అజ్మీరా చిరంజీవి(నరేష్) తన ఆటోను రోడ్డుపై నిలిపాడు. దీంతో బస్సు డ్రైవర్ ఇర్పా శ్రీను హారన్ కొట్టగా, ఆటో డ్రైవర్ చిరంజీవి ఆవేశంతో ఆయనపై దాడి చేయడమే కాక రాయితో బస్సు చుట్టూ అద్దాలను పగలగొట్టాడు. ఆపై కండక్టర్ గట్ల సీతారాములుపై కూడా దాడి చేసి క్యాష్‌బ్యాగ్ లాక్కున్నాడు. ఈఘటనతో ప్రయాణికులు ఆందోళనకు గురై పరుగులు తీశారు. స్థానికులు ఇచ్చినసమాచారంతో పోలీసులు చేరుకోగా వారిపై కూడా చిరంజీవి దాడికి యత్నించడం గమనార్హం. ఈ మేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకుని, ఆర్టీసీ కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

'యువికా' పదా ఇక..!

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడమే కాక శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఆధ్వర్యాన శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇందుకు అర్హులు కాగా, యువ విజ్ఞాని కార్యక్రమం (యువికా) పేరుతో దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకుని వారిలో ఎంపికైన విద్యార్థులకు ఇస్రో కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. – ఖమ్మంసహకారనగర్

ఎంపికైతే 'ఇస్రో' సెంటర్లలో శిక్షణ

- దరఖాస్తుకు 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

వీరికే ప్రాధాన్యత

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ పాఠశాలలు 429 ఉండగా.. ఈ ఏడాది 17,523 మంది విద్యార్థులు 9వ తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 'యువికా'కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఎనిమిది తరగతిలో మంచి మార్కులు సాధించడమే కాక మూడేళ్లలో ఒలింపియాడ్, సైన్స్ పోటీల్లో ఏదైనా బహుమతి పొంది ఉన్న వారితో పాటు స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లుగా కొనసాగుతూ ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చూపిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తారు.

ఇక్కడే శిక్షణ..

ఇస్రో అర్హత పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేశాక మే 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇస్తారు. డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్.రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో పాటు షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్లలో విద్యార్థులకు శిక్షణ ఉంటుంది. కాగా, శిక్షణ పూర్తయ్యాక విద్యార్థులందరినీ శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి పరిశోధనలపై అవగాహన కల్పిస్తారు. అలాగే, ఎంపికైన విద్యార్థితో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి అంతరిక్ష కేంద్రాలకు వెళ్లేందుకు అయ్యే ఖర్చులన్నీ ఇస్రోనే చెల్లిస్తుంది.



'యువికా'వివరాలతో కూడిన పోస్టర్

దరఖాస్తు ఇలా..

ఇస్రోలో శిక్షణ కోసం దరఖాస్తు విధానం నాలుగు దశల్లో ఉంటుంది. తొలుత ఈ – మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలో పాల్గొనాలి. క్విజ్ పూర్తయిన 60 నిమిషాల్లో యువికా పోర్టల్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. మొత్తం సమాచారంతో కూడిన దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సంతకం చేసిన ప్రతితో పాటు అవసరమైన అన్ని ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉండగా.. 28న మొదటి జాబితా, ఏప్రిల్ 4న రెండో జాబితా ప్రకటిస్తారు. కాగా, ఎంపికైన వారు మే 12న ఎంపిక చేసిన ఇస్రో కేంద్రాల వద్ద రిపోర్టు చేయాలి. పూర్తి వివరాల కోసం https:///jigyasa.iirs.gov.in/yuvika వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

సాగునీటికి రైతుల తిప్పలు

- సొంత ఖర్చులతో కట్టకు మట్టి



అశ్వరావుపల్లి ప్రధాన కాలువ నీరు నెల్లుట్ల చెరువులోకి వెళ్లకుండా సైఫన్ వద్ద మట్టిని పోస్తున్న రైతులు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండల పరిధిలోని నాగారం, లింగాల ఘణపురం రైతులు ఎండుతున్న యాసంగి పంటలను కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ పూర్తి కావడంతో అధికారులు నీటిని వదిలారు. అయితే నెల్లుట్ల చెరువు వద్ద సైఫన్ నుంచి నీరు వచ్చే చోట సంబంధిత కాంట్రాక్టర్ మట్టిని సరిగా పోయలేదు. దీంతో కట్ట తెగిపోవడంతో అధికారులు నీటిని ఆపేశారు. బిల్లులు రాలేదంటూ కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. దీంతో రైతులే స్వయంగా ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి పోస్తూ.. కట్టను మరమ్మతు చేసుకుంటున్నారు. ఈ కాల్వకు నీరు వస్తే లింగాలఘణపురం, నాగారం, కళ్లెం, సిరిపురం, మాణిక్యాపురం, జీడికల్ గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది.

ఎస్సీ వర్గీకరణే మా అంతిమ లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కరీంనగర్: ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ అంతిమ లక్ష్యమని, 29 ఏళ్లుగా సాగుతున్న తమ పోరాటం చివరి దశకు చేరుకుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశానికి మద్దతు ఇస్తున్న పార్టీని ఎమ్మార్పీఎస్ గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని, ఉద్యమ లక్ష్యం త్వరలో సాకారం కానుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉండటమే కాకుండా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని వివరించారు.

వైఎస్ విజన్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి

- అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి ప్రాజెక్టులతో నగర రూపురేఖలు మార్చారు
- అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉంది
- క్రెడాయ్ 13వ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి



క్రెడాయ్ ప్రాపర్టీ షోలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విజన్, విధానాల వల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమైందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాక ముందు హైదరాబాద్‌లో స్థిరాస్తి మార్కెట్ పూర్తిగా క్షీణ దశలో ఉండేదని, ఆయన సీఎం పదవి చేపట్టాక దూరదృష్టితో నగరాభివృద్ధి కోసం చేపట్టిన అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి విప్లవాత్మక ప్రాజెక్టులతో హైదరాబాద్ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని గుర్తుచేశారు. దీంతో అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉందని చెప్పారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ 13వ ప్రాపర్టీ షో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు కూడా భాగస్వాములేనన్నారు. బిల్డర్లు ఎంత వ్యాపారం చేస్తే రాష్ట్రం అంత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బిల్డర్లను వ్యాపారస్తులుగా చూసే విధానాలకు స్వస్తిచెప్పి పరిశ్రమ అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటామని పొంగులేటి హామీ ఇచ్చారు. శివారు ప్రాంతాల్లోని రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మరింత పెంచి హైదరాబాద్ దాహార్తిని తీరుస్తామని, నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. నిర్మాణ అనుమతులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ నలువైపులా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని పేర్కొన్నారు.

ధరణిలో 8.5 లక్షల దరఖాస్తులు పెండింగ్..

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వం ఎన్నో విధ్వంసాలకు పాల్పడిందని, సామాన్యులకు కలిగిన ఇబ్బందులను కళ్లారా చూస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రస్తుతం ధరణిలో 8.5–9 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిలో 5.8 లక్షల దరఖాస్తులను సహేతుక కారణాల్లేకుండానే తిరస్కరించారని విమర్శించారు. స్పెషల్ డ్రైవ్‌లతో గత వారం రోజులలో 80 వేల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని పొంగులేటి చెప్పారు. రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసి బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఉన్న లొసుగులను గుర్తించి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామన్నారు. పారదర్శక రెవెన్యూ వ్యవస్థను సామాన్యుల చెంతకు తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వైఎస్సార్ లాగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లతో ప్రధాన నగరంలో కూడా అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ మాజీ అధ్యక్షుడు సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



సాహిత్య (ఫైల్)

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణ

- కళాశాల ఎదుట బంధువుల ఆందోళన
- మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభ్యం
- హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఘటన

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పరిధి భీమారంలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన హాస్టల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే తమ కూతురును హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్ల కనపర్తికి చెందిన వలుగుల ప్రభాకర్, కవిత దంపతుల పెద్దకూతురు సాహిత్య (17) భీమారంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఆమె అదే కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో గత సబ్జెక్టుల్లో సాహిత్య అనుకున్నంత మేరకు పరీక్షలు రాయలేదు. దీంతో సాహిత్య మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె వద్ద లభ్యమైన సూసైడ్ నోట్ ద్వారా తెలుస్తోంది.

భవనంపై నుంచి దూకి..?

సాహిత్య, కళాశాల హాస్టల్ భవనం పైనుంచి శుక్రవారం తెల్లవారు జామున దూకి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాహిత్య కింద పడి ఉండటం గమనించిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడినుంచి ఎంజీఎంకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు.

సూసైడ్ నోట్ లభ్యం..

ఇదిలా ఉండగా సాహిత్య రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'జువాలజీ పరీక్ష రోజు చనిపోతున్నా'అని అందులో పేర్కొంది. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆ సూసైడ్ నోట్ తన కూతురిది కాదని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కూతురును హత్య చేసి.. ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి పెట్టారని తెలిపారు. భవనంపై నుంచి దూకితే చేతిపై బ్లేడ్‌తో కోసిన గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. తమ కూతురు మృతదేహాన్ని గోప్యంగా ఎందుకు ఎంజీఎంకు తరలించారన్నారు.

కళాశాల ఎదుట ఆందోళన

తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు నాలుగు గంటల పాటు ఈ ఆందోళన కొనసాగింది. వారి ఆందోళనకు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ, ఎస్సైలు రాజ్‌కుమార్, సురేష్‌లు ఆందోళనకారులను శాంతింపజేశారు. సాహిత్య మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. కళాశాలలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే సూసైడ్ నోట్‌ను ఫోరెన్సిక్స్ పరీక్షలకు పంపించనున్నట్లు చెప్పారు.

నేత్ర దానం

సాహిత్య నేత్రాలు దానం చేశారు. తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రాంతీయ నేత్ర వైద్యశాల, వరంగల్ సిబ్బంది నేత్రాలు సేకరించారు.

పుణ్య స్నానానికి వచ్చి అనంతలోకాలకు..

ఎస్సారెస్పీలో మునిగి ముగ్గురు యువకుల మృతి



సాయికిరణ్ (ఫైల్)



సాయినాథ్ (ఫైల్)



లోకేశ్ (ఫైల్)

బాల్కొండ: శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్య స్నానాల కోసం వచ్చిన ముగ్గురు యువకులు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిలో మునిగి మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం గన్యా తండాకు చెందిన అజ్మీరా సాయి కిరణ్ అలియాస్ మున్నా (17), అజ్మీరా సాయినాథ్ (16), బానవత్ లోకేశ్ (16)లతో పాటు వంశీ, సందీప్, అభిరాం శుక్రవారం ఉదయం ప్రాజెక్టుకు వచ్చారు. తొలుత మిత్రులందరూ రిజర్వాయర్‌లో స్నానం చేసి ఒడ్డుకు చేరారు. అయితే మట్టి అంటుకుందని మళ్లీ స్నానం చేసేందుకు సాయి కిరణ్, సాయినాథ్, లోకేశ్‌లు లక్ష్మీ కాలువ హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో గల నీటిలో దిగారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి పోయారు. ఒడ్డున ఉన్న వంశీ వాళ్లను కాపాడేందుకు నీటిలోకి దిగినప్పటికీ అతను కూడ మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్రమత్తమై అక్కడ ఉన్న సిమెంట్ కట్టడాన్ని పట్టుకుని బయట పడ్డాడు. ఆందోళనతో మిగతా మిత్రులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ విషయం తెలియగానే ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలు రిజర్వాయర్ నుంచి కాలువలోకి కొట్టుకుపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి లక్ష్మీ కాలువకు నీటిని నిలిపివేయించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికి తీశారు. సాయినాథ్, లోకేశ్‌లు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా సాయి కిరణ్ లారీపై దినసరి కూలీగా ఉన్నాడు. ఘటనా స్థలానికి గన్యా తండా వాసులు భారీగా చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యాదాద్రికి అఖండ జ్యోతి యాత్ర



బర్కత్‌పురలో ప్రారంభమైన అఖండ జ్యోతి యాత్రలో ప్రభుత్వ విప్ ఐలయ్య, ఈవో, అనువంశిక ధర్మకర్త, అచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బర్కత్‌పురలోగల యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి అఖండ జ్యోతి యాత్ర ప్రారంభమైంది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి శుక్రవారం ఈ యాత్రను ప్రారంభించారు. శ్రీస్వామి అమ్మవార్ల విగ్రహం ముందు ఆచార్యులు భారీ అఖండ దీపాన్ని వెలిగించారు. అఖండ జ్యోతి యాత్ర ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా యాదగిరిగుట్ట పట్టణానికి ఈ నెల 11న చేరుకుంటుంది.

భర్త వేధింపుల నుంచి రక్షించండి

మంత్రి కాళ్లు మొక్కిన మహిళ



రోదిస్తూ న్యాయం చేయాలని మంత్రిని వేడుకుంటున్న వివాహిత

ఎంజీఎం (వరంగల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళలంతా సంబరాల్లో మునిగిన వేళ...ఓ మహిళ మాత్రం తన భర్త వేధింపుల నుంచి రక్షించాలంటూ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కాళ్లపై పడి వేడుకుంది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఓ వివాహిత తన భర్త చేసిన దాడితో రెండు చేతులకు తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సురేఖ పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో సదరు మహిళ మంత్రి కాళ్లపై పడి వేడుకుంది. తన భర్త తీవ్రంగా హింసిస్తున్నాడని, పోలీస్‌స్టేషన్‌కు ఎన్నిసార్లు వెళ్లినా తనకు న్యాయం జరగడం లేదని వాపోయింది. రెండు చేతులపై గాయాలతో ఉన్న ఆమెను చూసి మంత్రి సురేఖ చలించిపోయారు. మహిళ పూర్తి వివరాలు తెలుసుకుని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆమెకు న్యాయం చేయాలని ఆదేశించారు.

జిల్లా వార్తలు

ఉపాధి సిబ్బంది.. తప్పని ఇబ్బంది

- ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్
- మూడు మాసాల క్రితం రెండు నెలల వేతనం చెల్లింపు
- మళ్లీ అప్పటి నుంచి నిలిచిన జీతాలు
- ఉపాధి చూపే వారికే ఆర్థిక సమస్యలు



ఉపాధి హామీ కూలీలను పర్యవేక్షిస్తున్న క్షేత్ర సిబ్బంది (ఫైల్)



కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది (ఫైల్)

అశ్వారావుపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి చూపెడుతూ పల్లెల్లో వలసలను అరికట్టేందుకు 2006లో ఏర్పాటైన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగులను వేతనాల ఇక్కట్లు వెంటాడుతున్నాయి. పేదలకు ఉపాధి చూపడంలో ఈజీఎస్ ఉద్యోగులదే కీలక పాత్ర. ఏడాదికి సరిపడా బడ్జెట్‌కు లోబడి ఉపాధి హామీ కూలీల సంఖ్యకు అనుగుణంగా పని దినాలను, పనులను ప్రతిపాదించడం మొదలు.. పనులను నమోదు చేసి నగదు చెల్లించే వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఔట్ సోర్సింగ్, ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్(ఎఫ్‌టీఏ)/కాంట్రాక్టు ఉద్యోగులకే బాధ్యతలు అప్పగించారు. వీరిలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ అనే గ్రామ స్థాయి ఉద్యోగి నుంచి హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ అనే రాష్ట్ర స్థాయి ఉద్యోగి వరకు అందరూ ఔట్‌సోర్సింగ్ లేదా ఎఫ్‌టీఏలే. జిల్లా స్థాయి పోస్టుల్లో పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులను కొంతకాలం మేర డిప్యూటేషన్ పద్ధతిన నియమిస్తుంటారు. ఉద్యానవన అధికారులు, ఇంజనీర్లు తదితర ఉద్యోగులను డిప్యూటేషన్ ద్వారా ఉపాధి హామీ పథకంలో నియమిస్తారు. కాగా ఉపాధి హామీ పథకం భారమంతా ఉద్యోగుల పైనే పడుతుంది.

భరించలేని పని ఒత్తిడి..

కార్యాలయ సిబ్బందికి జనవరి నుంచి జూలై వరకు పని ఒత్తిడి అధికంగా ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఏపీఓ, ఈసీ/ జేఈలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకోవాలి. కూలీలను తదుపరి పని దినానికి సిద్ధం చేసేందుకు గ్రామాల్లో పరిశీలించాలి. ఉపాధి హామీ సిబ్బందితోపాటు పలుగు, పార పట్టుకుని పని చేయకున్నా.. ఫీల్డ్ అసిస్టెంట్ ఒక గ్రామపంచాయతీలో ఎన్నిచోట్ల పనులు జరిగితే అన్నిచోట్లకు వెళ్లి పరిశీలించడంతో పాటు కూలీలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. టెక్నికల్ అసిస్టెంట్లు క్లస్టర్ల వారీగా మండలానికి నలుగురు వరకు ఉంటారు. ఈసీ/జేఈఈ మండలానికి ఒక్కరే ఉంటారు. వీరు మండలంలో జరిగే ప్రతి పనిని నేరుగా పరిశీలించి కొలతలు సరిచూసుకుని టెక్నికల్ అసిస్టెంట్ నమోదు చేసిన ఎం బుక్‌ను స్క్రూటినీ చేసి చెక్కులు సిద్ధం చేయాలి. ఈ చెల్లింపులన్నింటినీ కంప్యూటర్ ఆపరేటర్ కం అకౌంట్స్ అసిస్టెంట్లు ఆన్‌లైన్ చేయాలి. సీజన్ (జనవరి నుంచి జూలై వరకు)లో వీరిపై పని ఒత్తిడి అధికంగా ఉంటుంది. రాత్రింబవళ్లు పని చేసిన సందర్భాలూ ఉన్నాయి. గతంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రస్తుతం మరుగుదొడ్లు, సీసీ రహదారులు కూడా ఉపాధి హామీ పథకం ద్వారానే చేపడుతున్నారు. ఇలాంటి పనులు జరుగుతున్నపుడు స్థానికంగా ఉన్న రాజకీయ నాయకుల ఒత్తిడి కూడా ఉంటుంది. ఇన్ని సమస్యల మధ్య పనిచేస్తున్న సిబ్బందికి కనీసం ఉద్యోగ భద్రత లేదు. సకాలంలో వేతనాలూ రాక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నాలుగు నెలల వేతనాలు పెండింగ్..

ఉపాధి హామీ సిబ్బందికి ఆరునెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా రెండు నెలల వేతనాలు గత డిసెంబర్‌లో చెల్లించారు. ఇంకా నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఈఎంఐలు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు చెల్లించేందుకు అప్పు చేయలేక నానా అవస్థలు పడుతున్నామని ఉపాధి హామీ ఉద్యోగులు వాపోతున్నారు.

12,499 మంది ఉద్యోగులు

రాష్ట్రంలోని 33జిల్లాల్లో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లోని 528 మండలాల్లో 12,499 మంది ఉద్యోగులు ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో అత్యధికంగా ఫీల్డ్ అసిస్టెంట్లు 7,651మంది ఉండగా.. టెక్నికల్ అసిస్టెంట్ (ఎఫ్‌టీఈ)లు 1,831 మంది ఉన్నారు. ఇంకా కంప్యూటర్ ఆపరేటర్లు 849 మందితో పాటు ఏపీఓలు 378 మంది, ఈసీలు 257 మందితో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది కొనసాగుతున్నారు.

వేతనాలు చెల్లించాలి



ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలు సకాలంలో చెల్లించాలి. నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంటి అద్దెలు, పాఠశాలల ఫీజులు, ఇతరత్రా ఖర్చులు భారమవుతున్నాయి. మా ఉద్యోగాలను కూడా రెగ్యులర్ చేయాలని పలుమార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– వేముల సుధాకర్, ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



2006లో పథకం ప్రవేశపెట్టినపుడు ఎప్పటికైనా ఉద్యోగం పర్మనెంట్ కాకపోతుందా అనే ఆశతో విధుల్లో చేరాం. అప్పట్లో అహర్నిశలు పనిచేసేవాళ్లం. ప్రభుత్వ కార్యక్రమాలు ఏవయినా మా శాఖతో అనుసంధానం అయి ఉంటాయి. ఇప్పటి దాకా ఉద్యోగాలు పర్మనెంట్ కాలేదు. కనీసం జీతాలైనా నెలనెలా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– జీడీఆర్.పట్నాయక్, జేఏసీ కోశాధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఏజెన్సీ యువతులు విద్యపై దృష్టి పెట్టాలి



డీడీ మణెమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, కమాండెంట్ ప్రీతి

భద్రాచలంఅర్బన్: ఆదివాసీ మహిళా చైతన్యశక్తి ఆధ్వర్యాన శుక్రవారం భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రీతి ముఖ్య అతిథులుగా పాల్గొనగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ యువతులు విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మహిళలు గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, సఖి కేంద్రం నిర్వాహకురాలు శుభశ్రీతో పాటు వీసాల ఉమాదేవి, రామలక్ష్మి, శీలం దుర్గ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎండీసీని సందర్శించిన సీజీఎం జైన్



సీజీఎం జైన్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

పాల్వంచ: పాల్వంచలోని ఎన్ఎండీసీ కర్మాగారాన్ని సీజీఎం ఎస్.కే.జైన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కర్మాగారంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. కర్మాగారం సరిహద్దులు, స్థితిగతులపై అధికారులతో చర్చించారు. అనంతరం పలు కార్మిక సంఘాల నాయకులు ఆయన్ను కలిసి కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని కోరారు. దీనికి సీజీఎం స్పందిస్తూ తప్పక కర్మాగారం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆ తర్వాత సీజీఎంతో పాటు మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను యూనియన్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ కోటేశ్వరరావు, బాలునాయక్,. రంగయ్య, వై.సాంబశివరావు, ఉపేశ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోయే నీటిని చెరువులోకి మళ్లించండి



ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్

కారేపల్లి: కారేపల్లి మండలంలోని మాధారం డోలమైట్ మైన్స్ నుంచి వృథాగా పోతున్న నీటితో గోవింద్‌తండా దూసకుంట చెరువు నింపాలని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సూచించారు. గేటు కారేపల్లి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వచ్చిన ఎమ్మెల్యేకు గోవింద్‌తండా వాసులు నీటి సమస్యను వివరించారు. దీంతో ఆయన డోలమైట్ మైన్స్ డీజీఎం శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 200మీటర్ల మేర పైప్‌లైన్ వేయడం ద్వారా వృథాగా పోయే నీటిని దూసకుంట చెరువులోకి మళ్లించాలని తద్వారా పశువుల దాహార్తి తీరడంతో పాటు భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు.

ఏపీలోని ప్రగడవరంలో ఎంపీ పూజలు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సమేతంగా శుక్రవారం ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరంలో రామలింగేశ్వర సమేత విజయశంకర బాల కనకదుర్గాదేవి శివ పంచాయతన క్షేత్రాన్ని సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఆయన ఆలయ కోనేరులో అమ్మవారికి త్రిశూల స్నానం, శివ కళ్యాణం జరిపించారు. ఆతర్వాత యోగినీమాత ఆశీస్సులు తీసుకున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్



పూజల్లో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర దంపతులు

11న పండితాపురం సంత వేలం

కామేపల్లి: కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధిలో శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల వారాంతపు సంత నిర్వహణ కోసం ఈ నెల 11న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తెలిపారు. కాగా, సంత వేలం ఈనెల 5నే జరగాల్సి ఉన్నా వాయిదా వేసి, తిరిగి 11వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి ఉన్న వారు వేలం జరిగే రోజు ఉదయం 11 గంటల్లోపు ధరావతుగా రూ.30 లక్షలు, సాల్వెన్సీ కింద రూ.5 లక్షలను డీడీ లేదా నగదు రూపంలో చెల్లించాలని సూచించారు.

అమ్మంటే.. అమ్మే!



పొట్ట కూటి కోసం తాను ఎంత కష్టపడినా పిల్లలు మాత్రం రాజుల్లా బతకాలని ప్రతీ తల్లి కోరుకుంటుంది. అదే కోవలోకి ఈ కూలీ వస్తుంది. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కూలీలు పలువురు ఖమ్మం రూరల్ మండలం దారేడులో మిర్చి ఏరుతున్నారు. ఈ క్రమంలో తనతో పాటే పిల్లలను తీసుకొచ్చిన ఓ మహిళ ఎండ పడకుండా పెద్ద మొక్కపై దుప్పటి కప్పి కింద బస్తా పరచి కూర్చోపెట్టింది. ఆ తర్వాత ఆమె మాత్రం ఎండలో చెమటోడుస్తూ మిర్చి ఏరడం కనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం